# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు ఈరోజు ఘనంగా నిర్వహించారు.
- ❖ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యసాధనకు రాజ్యాంగ స్ఫూర్తితో కలిసికట్టుగా పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.
- ❖ రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధిపై రేపు విశాఖపట్నంలో రిజినల్ ఇన్వెస్ట్ మీట్ జరగనుందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

=========================

రాష్ట్ర వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారని, వారి ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని గవర్నర్ వివరించారు.

(వాయిస్ 29 సెకన్లు)

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

=========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత స్వాతంత్ర్య పోరాట ఆశయాలను నెరవేర్చడానికి, దేశ ప్రజలందరూ ప్రజాస్వామ్యపు నీడలో సురక్షితంగా, సుభిక్షంగా జీవించడానికి వీలుగా రూపొందిన రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మహనీయుల త్యాగాలను స్మరించుకుందామని పేర్కొన్నారు. వికసిత్ భారత్ - 2047, స్వర్ణాంధ్ర విజన్ 2047ల లక్ష్యసాధనకు రాజ్యాంగ స్ఫూర్తితో అందరం కలిసికట్టుగా కృషి చేయాలని సామాజిక మాధ్యమం వేదికగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

========================

గిరిజనుల ఆరాధ్య దేవత, రాష్ట్ర గిరిజన పండుగగా గుర్తింపు పొందిన శంబర పోలమాంబ జాతర మహోత్సవంలో భాగంగా ఈరోజు సిరిమాను చెట్టు శంబర గ్రామానికి చేరుకుంది. రైతులంతా సిరిమాను తయారీకి అవసరమైన తాడికర్ర చెట్టును పార్వతీపురం మన్యం జిల్లా కందులపదం గ్రామ నుండి ఈరోజు శంబర గ్రామానికి తీసుకొని వచ్చారు. ఈనెల 28న సిరిమాను సంబరం వైభవంగా నిర్వహించనున్నారు.

========================

ప్రజాస్వామ్య పాలనలో పౌరులందరికి న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం కల్పించి సోదరభావాన్ని పెంపొందించాలనిది రాజ్యాంగ లక్ష్యం అని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. ఈరోజు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 1950లో ఇదే రోజున అమల్లోకొచ్చిన రాజ్యాంగం గత 75 సంవత్సరాలలో వివిధ రంగాలలో చట్టబద్ధమైన పురోగతిని చూసిందన్నారు. శక్తివంతమైన దార్శనిక నాయకత్వంలో గణతంత్ర భారతదేశం అన్ని రంగాల్లో విశ్వగురువుగా ఆవిర్భావించటానికి ధృడంగా కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక రోజున, సమృద్ధిగా ఉన్న మన విస్తృత శ్రేణి మానవ, మేధో, సాంస్కృతిక, సహజ వనరుల్ని ఉత్తమ స్థాయిలో ఉపయోగించుకుంటూ... అన్ని రంగాలలో ప్రపంచంలోనే అత్యుత్తమ స్థాయి దేశంగా తీర్చిదిద్దేందుకు పునరంకితమవ్వాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు.

========================

ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల సంస్థ, ఐటీడీఏ భాగస్వామ్యంతో పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లోని గిరిజన రైతులకు 10.05 లక్షల రూపాయల విలువ గల బిందు, తుంపర్ల సేద్య పరికరాలను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ఈరోజు పంపిణీ చేశారు. 2024 - 25 సంవత్సరంలో సూక్ష్మ నీటిపారుదల పథకం కింద 1,800 హెక్టార్ల విస్తీర్ణంలో బిందు, తుంపర్ల సేద్య పరికరాలను ఉద్యాన వ్యవసాయ రైతులకు రాయితీపై అందజేసేందుకు ఐటీడీఏ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఈ పరికరాలు కలిగిన వాహనాన్ని శ్రీవాస్తవ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు.

విరామం

========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టు అవరణలో 76వ భారత గణతంత్య్ర దినోత్సవ వేడుకలు ఈరోజు ఘనంగా జరిగాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భారత రాజ్యాంగం అమలుకు ఎటువంటి విఘాతం కలుగకుండా న్యాయ వ్యవస్థ ఒక సంరక్షకునిగా పని చేస్తున్నదన్నారు. అటువంటి వ్యవస్థలో పనిచేసే న్యాయమూర్తులు, న్యాయవాదులు ఎంతో బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. సార్వభౌమ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్య్ర దేశంగా అభివృద్ధ పథంలో మన దేశం మరింత ముందుకు వెళ్లేందుకు 76వ భారత గణతంత్య్ర దినోత్సవ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

========================

రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, దీనిలో భాగంగా విశాఖపట్నంలో రేపు ప్రాంతీయ పెట్టుబడుల సదస్సు (రీజినల్ ఇన్వెస్ట్ మీట్) జరగనుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈరోజు రాజమహేంద్రవరంలో పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర పాత 5 జిల్లాలో పర్యాటక ప్రాజెక్ట్ లు చేపట్టేవారిని ఆహ్వానిస్తున్నాని, సుమారు 150 మంది ఇన్వెస్ట్ మీట్ కు హాజరుకానున్నారని తెలిపారు. పరిశ్రమలు స్థాపన మాదిరిగానే పర్యాటక రంగంలో రాయితీలను అందిస్తామన్నారు. రాబోయే 5 సంవత్సరాల్లో పర్యాటక రంగాన్ని అగ్రగామిగా తీసుకెళ్లే దిశగా అడుగులు వేస్తున్నామని మంత్రి వివరిస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

========================

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈరోజు సాయంత్రం విజయవాడలోని రాజ్‌భవన్‌లో 'ఎట్ హోం' కార్యక్రమం నిర్వహించారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తేనీటి విందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, ఉన్నత అధికారులు, తదితరులు హాజరయ్యారు.

========================

తెలుగువారి ప్రతిభకు పద్మ పురస్కారాలు వరించాయని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏడుగురికి ఈ అవార్డులు దక్కడం గర్వకారణమని ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. వైద్యం, కళలు, సాహిత్యం, ప్రజా సేవ తదితర రంగాల్లో విశేష కృషి చేసి దేశానికి గర్వకారణంగా నిలిచిన వీరి కీర్తి తెలుగువారందరికీ తరగని స్ఫూర్తి అని కొనియాడారు.

========================
========================